సూర్య www.suryaa.com
18వ వసంతంలోకి ...
ఆదివారం 16 మార్చి
2025 , పేజీలు 05

# అదిలాబాద్ - మంచిర్యాల



సూర్య
www.suryaa.com
★ నిర్మల్ ★ కొమురంభీం ఆసిఫాబాద్


## స్పష్టమైన జాబితా రూపకల్పనలో

# రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్తో కలిసి మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ ఈ. ఆర్.ఓ.లు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, డి.చంద్రకళ, ఎన్నికల విభాగం అధికారి కె.వై.ప్రసాద్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగితా.. 2లో

## ప్రభుత్వ పాఠశాలలలో విద్యాభోదనకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యాభోదన చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.శనివారం నిర్మల్ గ్రామీణ మండలం మేడిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్తో కలిసి ఏఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్ను కలెక్టర్ ప్రారంభించారు.విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, గణితం సబ్జెక్టుల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం తదితర అంశాలను పరిశీలించారు. ( మిగితా..2లో )

### ఏఐ ఆన్ లైన్ కార్యక్రమంతో

# వెనుబడిన విద్యార్థులకు ఎంతో లాభం

### - జిల్లా పాలనాధికారి రాజర్షి షా

**ఆదిలాబాద్,సూర్య మేజర్ న్యూస్ :** ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రోగ్రాంను అదిలాబాద్ రూరల్ తాటిగూడ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్లో శనివారం ప్రారంభించిన జిల్లా




కలెక్టర్ రాజర్షి షా.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రాథమిక తరగతుల విద్యార్థుల కోసం వారు చదువులో ముందుండటానికి ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపటుతున్నదని అందులో భాగంగానే మొదట 6 జిల్లాల్లో ఏఐ ఆధారిత ఆన్లైన్ లెర్నింగ్ ప్రాసెస్ ప్రారంభించిందన్నారు.అక్కడ విజయవంతం కావటంతో మిగిలిన 27 జిల్లాల్లో ఈ రోజు నుండి నాలుగు ప్రైమరీ పాఠశాలలలో ప్రారంభించడం జరిగిందన్నారు..3,4,5 తరగతుల విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను బలోపేతం చేయుటకు ఈఎక్స్ స్టెప్ అనే ఆర్గనైజేషన్తో కలిసి ఏఎక్స్ఎల్ అనే ఏఐ ఆధారిత వెబ్సైట్ ద్వారా విద్యార్థులకు బోధించడం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు విద్యార్థుల చదువుపట్ల అశ్రద్ధ చేయకుండా ప్రతీ రోజూ పాఠశాలలకు పంపించాలని ఆన్నారు.ఏఐ ద్వారా భాషలలో,గణితంలో వెనుకబడిన విద్యార్థులను తక్కువ సమయంలో సి గ్రేడ్ నుండి ఏ గ్రేడ్ కు మార్చవచ్చని ఏఐ గురించి పేరెంట్స్కు వివరించారు.జిల్లా విద్యాధికారిణి ప్రణీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ ,కోర్సు ట్రైనీ, మండల విద్యాధికారి మనోహర్ ,ఏఎస్ఓ. శ్రీకాంత్ ,ట్రైనీ గణేష్ , తదితరులు పాల్గొన్నారు.



### కృత్రిమ మేధ ద్వారా అందిస్తున్న బోధనను

# విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాదు ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ద్వారా అందిస్తున్న సాంకేతిక బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన మండలం తక్కల్లపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా 10వ తరగతి విద్యార్థులకు బోధన అందించే కంప్యూటర్స్ను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలివిడతగా చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 4 పాఠశాలలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్ లను రాష్ట్ర ప్రభుత్వం, ఏక్ స్టెప్ ఫౌండేషన్ల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలో మరికొన్ని పాఠశాలలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భాష, గణిత సామర్థ్యాల సాధన (ఎస్.ఎల్.ఎన్.) పెంపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎంతో దోహద పడుతుందని, కృత్రిమ మేధస్సును విద్యారంగంలో అమలు చేయడం విప్లవాత్మకమైన ఆలోచన అని తెలిపారు. ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా బోధన చేయాలని, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విద్యార్థుల స్థాయిలకు అనుగుణంగా సాధనతో పాటు విద్యా బోధన చేస్తుందని, ఒక్కొక్క కంప్యూటర్ ఒక్కొక్క ఉపాధ్యాయుడని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. ( మిగితా ...2లో )

### వినియోగదారుడు

# తన హక్కును తెలుసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్**

ప్రతి వినియోగదారుడు తనకు గల హక్కులను తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ సదావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజన్న మండల అధికారులు.. ( మిగితా. 2లో )



### పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

**ఆసిఫాబాదు,సూర్య మేజర్ న్యూస్ :** మండల మహిళా ప్రాంగణ పాఠశాల నిర్మాణం పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లాలో జరి మండల మహిళ ప్రాంగణ పాఠశాలలో జరుగుతున్న పెయింటింగ్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి నాణ్యత, పురోగతి, సామాగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పనులను నిర్ణీత సమయంలో చేయాలని, నాణ్యతలో రాజీ పడకూడదని తెలిపారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందించడానికి పెయింటింగ్ పనులు చేపట్టడం జరిగిందని, ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించి నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సూర్య
ఆదివారం 16 మార్చి 2025

# స్పష్టమైన జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**మొదటి పేజీ తరువాయి...**

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2025లో భాగంగా ఓటరు జాబితా సంబంధిత దరఖాస్తు ఫారాలు 6, 7, 8 ల నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై వచ్చే దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిష్కరించడలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించాలని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 271, బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో 419, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో 596 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, 2, 3 రోజులలోగా ఈ దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలు అందించాలని ఓటరు జాబితాలో మృతి చెందిన వారి వివరాలను బూత్ స్థాయి అధికారి, రాజకీయ పార్టీలచే నియమించబడిన బూత్ స్థాయి. ఏజెంట్లు సమన్వయంతో పని చేసి ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి తొలగించడంతో పాటు 2, 3 ఎపిక్ కార్డులు కలిగిన వారి వివరాలను పరిశీలించి తొలగించాలని తెలిపారు. ఒక కుటుంబానికి చెందిన అర్హత గల ఓటర్లు అందరు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మినిట్స్ ఆఫ్ మీటింగ్ సంబంధిత వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వివరాలు ఈ-మెయిల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధ ద్వారా అందిస్తున్న బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**మొదటి పేజీ తరువాయి..**

ప్రాథమిక స్థాయిలో భాష, గణితం లలో అభ్యాసన సామర్థ్యాలతో పాటు కృత్రిమ మేధ సాయంతో ప్రాథమిక పాఠశాలలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులలో మెరుగైన సామర్థ్యాలను సాధించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలలకు పంపించాలని, కృత్రిమ మేధ బోధన ద్వారా విద్యార్థులలో అభ్యాసన స్థాయిలు మెరుగుపడతాయని తెలిపారు. 10వ




తరగతి విద్యార్థులు కేవలం ఉత్తీర్ణతే కాకుండా మంచి మార్కులు సాధించాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల సామర్థ్యంపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకోవాలని తెలిపారు. తక్కల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్పులు తీసుకువచ్చిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రామ్ మోహన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకరమ్మ, విద్యాశాఖ సమన్వయకర్త ఉప్పులేటి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శంకరమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### వినియోగదారుడు

# తన హక్కును తెలుసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మొదటి పేజీ తరువాయి...**

శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి,



పౌరసరఫరాల శాఖ అధికారిలతో కలిసి సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పెట్రోలియం సంస్థలు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు, రేషన్డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థిరమైన జీవన విధానానికి న్యాయమైన పరివర్తన / మార్పు అనే అంశంపై ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం- 2026 నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆన్లైన్లో వస్తువుల కొనుగోలు చేసినప్పుడు వినియోగదారుడు ఎంపిక చేసుకున్న వస్తువు కాకుండా. దెబ్బతిన్నది / వేరేది / మోసపూరితమైన వస్తువులు వచ్చినప్పుడు సంబంధిత ఆన్లైన్ సంస్థ పోర్టల్లో వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందని, పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయాలని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో ఆయా బ్యాంక్ శాఖలలో ఖాతా కలిగి ఉన్న వినియోగదారులు నగదు లావాదేవీల విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తినట్లయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్లైన్ పోర్టల్లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. హొటళ్ళు, రెస్టారెంట్లలో తినేందుకు వెళ్ళినప్పుడు వినియోగదారులకు అందించే ఆహారం నాణ్యతగా లేకపోయినా, ఆహారం తయారీలో సరైన నిత్యావసరాలు వినియోగించకపోయినా, సరైన ఆహారం అందించకపోయినా ఫుడ్ ఇన్స్పెక్టర్కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్య అవసరాల కొరకు ఆసుపత్రికి వెళ్ళినప్పుడు సరైన వైద్య సేవలు అందించకపోయినా, వైద్యులు ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మందుల షాపులో మందులు ఇవ్వకపోయినా మెడికల్ బోర్డ్ / డ్రగ్ ఇన్స్పెక్టర్కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మార్కెట్లో వివిధ వ్యాపార సంస్థల ద్వారా విక్రయించబడే వస్తువులు / సరుకులపై ముద్రించబడే కాలపరిమితికి సంబంధించి కొనుగోలు సమయంలో వినియోగదారులు పరిశీలించుకోవాలని, కాలపరిమితి ముగిసిన వాటిని విక్రయించినట్లయితే వాటి వలన కలిగే నష్టాలు, తీసుకోవలసిన చర్యలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేటి ప్రపంచంలో ప్రతి ఒక్కరు. సోషల్ మీడియాలో ఉంటున్నందున వినియోగదారుల హక్కులు, వినియోగదారుల కోర్టు వివరాలతో వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనతరం వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రకాష్ కలిసి వినియోగదారుల హక్కుల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వినియోగదారుల హక్కుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యాభోదన చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**మొదటి పేజీ తరువాయి...**

అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో విద్యను



అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మల్ జిల్లాలో 16 ప్రభుత్వ పాఠశాలలలో ఏఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్ లను ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. 3 నుండి 5వ తరగతి విద్యార్థులకు %ూ×% ఆధారిత విద్యా యాప్‌లు, ప్లాట్‌ఫామ్‌లు ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని గుర్తించి, మెరుగుపరిచేందుకు ప్రత్యేక పాటాలను సూచిస్తాయని తెలిపారు. ఏఐ ఆధారిత యాప్‌లు కథలు, వీడియోలు, ఆటల ద్వారా పిల్లలలో చదవడం, లెక్కించడం మీద ఆసక్తిని పెంచుతాయని, కృత్రిమ మేధస్సును వినియోగించుకుని, ప్రతి విద్యార్థి ప్రాథమిక విద్యలో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య, విద్యా, ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, తహసిల్దార్ సంతోష్, ఎంపీడీవో గజేందర్, విద్యాశాఖ అధికారులు సలోని, ప్రవీణ్, లింబాద్రి, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ నెల టీకాలు తీసుకోవాలి.డాక్టర్ వినయ్ ఉప్రే

**వాంకిడి మార్చి 15సూర్య మేజర్ న్యూస్:** గర్భిణులు, పిల్లలు క్రమం తప్పకుండా రోగనిరోదక టీకాలు తీసుకోవాలని మండల వైద్యాధికారి వినయ్ ఉప్రే అన్నారు. శనివారం మండలంలోని సోయంగూడ గ్రామంలో టీకాల కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గర్భిణులు ఆరోగ్య పరీక్షలకు ప్రతీ నెల ఆసుపత్రికి రావాలని కాన్పుకు వారం రోజుల ముందే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. ఎండలు అధికమవుతుండగా ప్రజలు వడ దెబ్బకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పనులు ఉంటే తప్ప బయటికి రాకపోవడమే మంచిదని అన్నారు. అనంతరం వైద్య శిభిరం నిర్వహించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్. సిబ్బంది పుష్ప, సారిక పాల్గొన్నారు.



### ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమంలో భాగంగా


# ఎ. ఐ. ద్వారా విద్యా బోధన

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**కెరెమెరి,మార్చి 15,సూర్య మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలలలో ఎఫ్.ఎల్.ఎన్.



కార్యక్రమంలో భాగంగా 3 , 4, 5 తరగతుల విద్యార్థుల కోసం ఎఫ్.ఎల్.ఎన్.- ఎ. ఐ. (ఎ. ఎక్స్. ఎల్.) ద్వారా విద్య బోధన చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లాలోని కెరమెరి మండలం గోయగం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనప కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో తెలుగు, గణితం లలో చతుర్విధ ప్రక్రియలలో వెనుకబడి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి వారిని 2 గ్రూపులుగా చేసి 4 రోజులు రోజు ఒక్కో విషయాన్ని 20 నిమిషాల పాటు కృత్రిమ మేధ ద్వారా కంప్యూటర్ లో బోధించి వారికి ఎంతవరకు అవగాహన అయింది అనే విషయాన్ని మూల్యాంకనం చేసి వారి పఠన సామర్థ్యం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం రానున్న రోజులలో ప్రతి పాఠశాలకు చేరుతుందని, కృత్రిమ మేధ తో పాఠ్యాంశాలను బోధించే విధంగా విప్లవాత్మక ఆలోచన చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, పాఠశాల ఎ. ఎ. పి. సి. చైర్మన్ రాధ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# తలమడుగు,తాంసి పోలీస్ స్టేషన్లను

## పరిశీలించిన జిల్లా ఎస్పీ

**ఆదిలాబాద్ మార్చ్ 15,సూర్య మేజర్ న్యూస్**



తాంసి , తలమడుగు పోలీస్ స్టేషన్లను శనివారం సందర్శించి జిల్లా ఎస్పీ సిబ్బంది తగు సూచనలు చేశారు. రెండు పోలీస్ స్టేషన్లో పరిధిలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తూ వాటిని అరికట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదుదారులను గౌరవంగా వ్యవహరిస్తూ రిసెప్షన్ సెంటర్ నందు ప్రతి ఒక్క ఫిర్యాదుని నమోదు చేసుకొని బాధితులకు సత్వర పరిష్కారం అందించే దిశగా కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రతను కలిగి ఉంచుకోవాలని తెలియజేశారు. వచ్చే ఫిర్యాదుదారులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు .రెండు పోలీస్ స్టేషన్లో ఎస్ఐలు జిల్లా ఎస్పీకి పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. తదుపరి పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటడం జరిగింది. కోర్టు డ్యూటీ విధులను ఎస్సైలు నిరంతరం పర్యవేక్షిస్తూ కేసుల నందు శిక్షలు పడేవిధంగా కృషి చేయాలని తెలిపారు. నేరస్థులకు శిక్షలు పడినప్పుడే జిల్లాలో జరిగే నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ గ్రామీణ సీఐ కె ఫణిదర్, ఎస్సైలు ధడక రాధిక, అంజమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గజెల్లీ మోహన్ కు

# జాతీయ ఉగాది పురస్కార అవార్డు

**బెల్లంపల్లి, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్:**

గజెల్లీ మోహన్ కు జాతీయ ఉగాది పురస్కారం, సేవారత్న అవార్డు తార ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున హైదరాబాదులోని రవీంద్ర భారతిలో భారతీయ సాంప్రదాయ సాంస్కృతిక కలోత్సవంలో భాగంగా జాతీయ ఉగాది పురస్కారాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగ సినీ యాక్టర్ సుమన్, పరికి పండ్ల నరహరి ఐఏఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ మధ్యప్రదేశ్, ప్రముఖ రచయిత నందిని సిద్ధారెడ్డి, కృష్ణమోహన్, మాజీ బిసి కమిషన్ చైర్మన్ మరియు అనేకమంది




రచయితలు అతిథులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం రూపకర్త తార ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ సంకె రాజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున ఈ కార్యక్రమం ఉదయం నుండి రాత్రి వరకు నిర్వహించడం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ ఇతర రాష్ట్రాల నుండి సాంప్రదాయ నృత్యాల ప్రదర్శన జరిగినది. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారిని జాతీయ ఉగాది పురస్కారం కింద అవార్డులను అందించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా గత 30 సంవత్సరాలుగా సామాజిక సేవలో, సంఘమిత్ర. ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమాల ద్వారా అనేక సంఘ సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో భాగస్వాములవుతూ గతంలో జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం చేత ప్రభుత్వ ఇతర సంస్థల చేత బహుమతులు అవార్డులు స్వీకరించి నారు. గతంలో చేసిన సేవలను ఆధారంగా చేసుకుని గజెల్లీ మోహన్ సంఘ సేవకులు, లెక్చరర్ అయిన నాకు జాతీయ ఉగాది పురస్కారం కింద సేవా రత్న అవార్డును ముఖ్య అతిథులు సినీ యాక్టర్ సుమన్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా నాకు అవార్డునందించిన తార ఆర్ట్స్ అకాడమీకి మరియు నాకు అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని గజెల్లి మోహన్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

# టిబి పేషెంట్ లకు నీక్షయ పోషన్ కిట్స్ అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ మార్చ్ 15,సూర్య మేజర్ న్యూస్**

అంకోలి పీహెచ్ సి పరిధిలో నిక్షయ్ పోషన్ కిట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయటం జరిగింది. అంకోలిలో 125 టీబీ కేసులు ఉండగా, శనివారం గ్లాండ్ ఫార్మా ప్రతినిధులు కెప్టెన్ రఘురామన్, గిరీష్ సుబ్బరాజు, లోక భారతి ట్రస్ట్ నుండి కుమారన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్షయ వ్యాధి గ్రస్తులు తమ అరోగ్యం నిలచెట్టుకోవాంటే సరియైన సమయంలో మందులు , పోషణ అవసరమని సూచించారు.ఆరు నెలల పాటు ప్రతీ నెల ఈ కిట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా. నరేందర్ రాథోడ్, అదనపు డి ఏం ఏచ్ ఓ డా.మనోహర్, డి టి సి ఒ డా.సుమలత, డా.సాధన, పి ఒ ఎన్ సి డి డా.శ్రీధర్, డి ఎల్ ఓ డా.గజానంద్, అంకోలి ఎం ఓ డా.ఆశకిరణ్, డా.సర్ఫరాజ్, డా. సాయి ప్రియి, షిరిన్ మరియు టీబీ వ్యాధి గ్రస్తులు, అంకోలీ స్టాఫ్ పాల్గొన్నారు.




## నిత్యం ప్రజాక్షేత్రంలో వుండే ప్రతి కార్యకర్తకు గుర్తింపు

### - ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్

### - మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గనికి పలు సూచనలు

**కడెం,మార్చి 15, సూర్య మేజర్ న్యూస్ :**

నూతనంగా ఎన్నికైన ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు.శనివారం ఉట్నూరు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం



నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూమన్న, వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్ మరియు డైరెక్టర్ లు కాంగ్రెస్ నేతల తో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించి అభినదించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ,ఆ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానాన్ని కల్పిస్తుందన్నారు.నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల అభివృద్ధికి పాటు పడాలని అన్నారు.రైతు లేనిది దేశం లేదని,రైతులే ఈ దేశానికి వెన్నుముక్కలని అన్నారు కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి , కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్ వర్మ , మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ లు యాదగిరి, జలజ ,విట్టల్, నారాయణ,నాయకులు వాజీద్ ఖాన్ , లక్ష్మన్ ,చంద్ర శేఖర్ , రాజు రమేష్, ఆకుల లచ్చన్న, దేవందర్ గౌడ్ , తిరుపతి రెడ్డి,దుర్గం రాజేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## సి.ఎం.దిస్టి బొమ్మ దగ్ధం చేసిన బిఆర్ఎస్ నాయకులు.

**కాగజ్‌నగర్ సూర్య మేజర్ న్యూస్** : కాగజ్ నగర్ పట్టణంలో శనివారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.మాజీ మంత్రి బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని సరైన కారణాలు లేకుండా కుట్రపూరితంగా అసెంబ్లీ నుండి సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది.బిఆర్ఎస్ నాయకులు స్పీకర్ నిర్ణయాన్ని అన్యాయంగా భావించారు.జగదీశ్ రెడ్డికి వ్యతిరేకంగా రాజకీయ కుట్ర జరిగిందని ఆరోపించారు.సిర్ పూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ యూత్ కన్వీనర్ కాశిపాక రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సమర్థకులు పాల్గొన్నారు. బట్టుపల్లి చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై అన్యాయంగా వ్యవరిస్తుంది అని , ఇది ప్రజాస్వామ్య సూత్రాలకు భంగం కలిగిస్తుందని హెచ్చరించారు.ఈ నిరసనతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.త్వరలో జగదీష్ రెడ్డి పై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయకపోతే బిఆర్ఎస్ పార్టీ తరపున మరింత పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరగనున్నట్లు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపి రాజ్ కుమార్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు అంబాల ఓదెలు కాగజ్ నగర్ మండల అధ్యక్షులు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# నిషేధిత హెచ్ టీ పత్తి విత్తనాలు సీజ్

**మంచిర్యాల టౌన్, మార్చి 15,సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల పట్టణంలోప్రభుత్వ అనుమతి లేని హెచ్ టీ పత్తి విత్తనాలు తరలిస్తున్న ముఠా ను అదుపులోకి తీసుకోన్న పోలీస్ లు.స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం మండల వ్యవసాయ అధికారి తాడూరి మహేందర్ అందించిన సమాచారం ప్రకారం రైల్వే స్టేషన్ ప్రాంతం లో అనుమానం గా వెళుతున్న ఆటోను అపి తనిఖీ చేయగా అందులో ప్రభుత్వం నిషేధించిన జీటీ -3/హెచ్ పత్తి విత్తనాలు 4 బ్యాగులలోని 100కిలో (ఒకొక్క బ్యాగ్ 25కెజీ )గల పత్తి విత్తనాలు లభించాయని,వీటి విలువ 1,70,000/- రూపాయలు అని తెలిపారు.6గురు పై కేసు నమోదు చేశామన్నారు.

# నిరుపయోగంగా ఉన్న పశువుల తొట్టి

**ఇచ్చోడ, మార్చి 15,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామంలో నిరుపయోగ కరంగా నిలిచి ఉన్న పశువుల తోట్టి అసలే వేసవికాలం కావడంతో అలమటిస్తున్న మూగ జీవులు, ఇట్టి సమస్యను గ్రామ యువ రైతు సంబంధిత గ్రామ పంచాయితీ కార్యదర్శి కి విన్నవించగా కార్యదర్శికు బదులుగా గ్రామ కారోబారి తొట్టి పూర్తిగా ధ్వంసం అయిందని సమాధానం ఇచ్చారు. గ్రామ పంచాయతీ సంబంధిత బావి నుండి కొంత వ్యక్తులు తమ స్వార్ధం కోసం ఇంటి నిర్మాణాలకు, బావిలో నీటిని చిన్నపాటి మోటార్ల సహాయంతో నీటిని తోడేస్తున్న పట్టింపు లేని పంచాయతీ కార్యదర్శి ఇక నైనా పై అధికారులు స్పందించి పశువుల తొట్టిలో నీటి నిలువ చేసి పశువుల దాహాన్ని తీర్చాలని గ్రామస్తులు, పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నారిశక్తిలో భాగంగా విధుల్లోకి మహిళ సిబ్బంది

**కడెం,మార్చి15, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలమేరకు నారిశక్తి కార్యక్రమంలో




భాగంగా శనివారం నిర్మల్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళ సిబ్బంది బ్లూకోర్ట్, పెట్రో విధులు నిర్వహిస్తున్నారు. నారీశక్తి కార్యక్రమంలో భాగంగా కడం మహిళ సిబ్బందికి పెట్రోకార్, బ్లూ కోర్ట్ విధులను కేటాయించినట్లు కడం యస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

## అనారోగ్యానికి గురైన సీనియర్ నాయకుడు గోపతి రాజయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే వివేక్

**రామకృష్ణాపూర్, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్.**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు అన్న విషయం తెలుసుకున్న చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి రామకృష్ణాపూర్ లోని గోపతి రాజయ్య స్వగృహం లో శుక్రవారం ఆయనను పరామర్శించడం జరిగింది, ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



### సింగరేణి వ్యాప్తంగా

## బలపడుతున్న సిఐటియు

### - స్వచ్ఛందంగా యూనియన్‌లో చేరుతున్న యువ కార్మికులు

**మందమర్రి, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్.** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు చేస్తున్న అలుపెరుగని పోరాటాలకు ఆకర్షితులై యూనియన్ ను కార్మికులు ఆదరించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సింగరేణి వ్యాప్తంగా యూనియన్‌లో చేరుతున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు సాంబారు వెంకటస్వామి, అల్లి రాజేందర్ లు అన్నారు. ఏరియాలోని కేకే 5 గనిపై నిర్వహించిన సమావేశంలో గని ఫిట్ సెక్రటరీ సంకె వెంకటేష్ ఆధ్వర్యంలో సూరజ్, నరేందర్ లతో పాటు యువ కార్మికులు యూనియన్ లో చేరగా వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని గనుల్లో యువ కార్మికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి యూనియన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలకు ఆకర్షితులై యూనియన్‌లో చేరుతున్నారని, కార్మికుల చేరికతో యూనియన్ బలోపేతం అవడమే కాకుండా కార్మికుల హక్కులు డిమాండ్ల సాధన కోసం పోరాటాలు ఆందోళనలు నిర్వహించే గురుతర బాధ్యత యూనియన్ పై ఉందని వారు స్పష్టం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య సొంతింటి కళ సాకారంతో పాటు ఇతర కార్మికుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న ఆందోళనలు, పోరాటాలతో కార్మికులు పెద్ద ఎత్తున యూనియన్ లో చేరుతున్నారని అన్నారు. కార్మికుల సమస్యలపై ప్రధాన ప్రతిపక్ష పాత్రను సీఐటీయూ పోషిస్తుందని, స్ట్రక్చరల్ సమావేశాలు గత గుర్తింపు సంఘం టిబిజికెఎస్ హయాంలో నిర్వహించలేదని దీనిపై ఎందుకు ప్రశ్నించలేదని ప్రతిపక్షాలను విమర్శిస్తున్న ఏఐటీయూసీ నాయకులు గతంలో ప్రాతినిధ్య సంఘంగా గెలిచిన 2 ఏరియాల్లో స్ట్రక్చర్ సమావేశాలు ఎందుకు నిర్వహించలేదో ఏఐటియుసి నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని వారు హితవు పలికారు. ఏరియాలో జరిగిన స్ట్రక్చర్ సమావేశాలలో చర్చించిన కార్మికుల సమస్య లను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ ప్రమోషన్లను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. గనులలో జరుగుతున్న ప్రమాదాల తీరుపై అధ్యయనం చేసి భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదర్శ్, విద్యాసాగర్ గని కార్మికులు పాల్గొన్నారు.



### అధికారుల నిర్లక్ష్యం కార్మికులకు ప్రాణసంకటమైంది

**శ్రీరాంపూర్, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్:** గని ప్రమాదాల్లో సింగరేణి యాజమాన్యం నూటికి నూరుపాళ్ళు నిర్లక్ష్యంగానే ఉన్నది. పెరిగిన పని భారంతో కార్మికులు ఎట్టి జీతగాళ్లుగా మారిపోయారు. కేవలం ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యంగా యాజమాన్యం కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందని శ్రామికశక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఎఐఎఫ్టియు) స్పష్టం చేస్తుంది. యంత్రికరణ, ప్రైవేటీకరణ, కాంట్రక్టీకరణ లతో అండర్ గ్రౌండ్ గనులు ఓసీపీ లు గా మారిపోయినాయి. నేడు సింగరేణిలో కార్పొరేటీకరణ వల్ల పూర్తిగా కనుమరుగు కానున్నది. ఇటీవల జరిగిన గని ప్రమాదాలన్నీ



అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగినాయి. తద్వారా కార్మికుల ప్రాణాలు గాలిలోకి కలిసిపోయాయి. ప్రమాదానికి కారకులైన అధికార్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా యాజమాన్యం మొక్కుబడిగా విచారణ చేసి చేతులు దులుపుకుంది. గని ప్రమాదంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు తీరని లోటు ఏర్పడింది. గనుల్లో పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని. గని ప్రమాదలపై డీజీయంఎస్ చే న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యులైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రామికశక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఎఐఎఫ్టియు) డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రత్న కుమార్, శ్రామికశక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల పోచమల్లు, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ)కు దరఖాస్తు చేసుకున్న వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

**నిర్మల్ మార్చి 15, సూర్య మేజర్ న్యూస్** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ)కు దరఖాస్తు చేసుకున్న వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో మున్సిపాలిటీల పరిధిలో 17906, గ్రామీణ



ప్రాంతాలలో 6680 దరఖాస్తులను రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అర్హమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటికే పలువురు దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లిస్తున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలో ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీ కల్పించడం జరిగిందని ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని తెలిపారు. మార్చి 31 వ తేదీతో లే అవుట్ల దరఖాస్తుల రుసుము చెల్లించే గడువు ముగుస్తుందన్నారు. గడువు ముగిసిన తర్వాత మళ్ళీ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉండదని, కావున దరఖాస్తుదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన రుసుములు చెల్లించాలని ఆ ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

## తాగు నీరు లేక సచ్చుడేనా?

### - దళిత వాడలంటే చులకనా?

### - చేతిపంపుకు మరమ్మత్తులు చేయాలి

**కాగజ్‌నగర్ ,సూర్య మేజర్ న్యూస్** సిర్పూర్ టీ నియోజకవర్గం కౌటాల మండలంలోని వీరవెల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత 20రోజుల నుండి చేతిపంపు చెడిపోవడంతో త్రాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నమని వీరవెల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అసలే



వేసవికాలం ప్రారంభం కావడంతో.. మరో వైపు మిషన్ భగీరథ నీరు అవసరం ఉన్న సమయానికి సరఫరా కాకపోవడంతో త్రాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యకం చేస్తున్నారు. గ్రామపంచాయితీ కార్యదర్శికీ గత 20రోజుల నుంచి ఎన్ని సార్ల విన్న వించినకూడా, చేస్తాను అని చెప్పి ఎలాంటి మరమ్మత్తులు చెయ్యకుండా ఉన్నారని, దయచేసి అధికారులు వెంటనే స్పందించి చేతిపంపుతకు మరమ్మత్తులు చేసి ఎస్సీ కాలనీ వాసుల సమస్య పరిష్కరానికి కృషి చేసి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతునారు.

### సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణి



**రామకృష్ణాపూర్, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్.** రామకృష్ణపూర్ జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులకు సిరి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, జి ఎస్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రాజా రమేష్ చేతుల మీదుగా పరీక్ష సమాగ్రి పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజా రమేష్, సిరి ఫౌండేషన్ అధ్యక్షులు సరిగమల తిరుపతి మాట్లాడుతూ...మార్చి 21 నా జరిగె పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులకు మంచి ప్రతిభ కనబర్చి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, అలాగే ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని, విద్యార్థులు మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించి సమాజంలో తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, జి ఎస్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రాజా రమేష్, సిరి ఫౌండేషన్ అధ్యక్షులు సరిగమల తిరుపతి, ఉపాధ్యక్షులు కడగొండ సాయి కుమార్, సిరి ఫౌండేషన్ సభ్యులు సంధ్యవేణి సంతోష్ కుమార్,కనకం మోహన్, విక్రమ్, సీనియర్ నాయకులు జక్కనబోయినా కుమార్,చంద్రమౌళి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

### సంస్కార్ స్కూల్ డే& పాసిటివ్ పేరెంటింగ్ సెమినార్ విజయవంతం

**భైంసా టౌన్,మార్చ్ 15,సూర్య మేజర్ న్యూస్** భైంసా పట్టణంలోని బృందావన్ గార్డెన్స్‌లో సంస్కార్ స్కూల్ డే మరియు పాసిటివ్ పేరెంటింగ్ సెమినార్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావు పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై, తల్లిదండ్రులకు విలువైన సూచనలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పిల్లలకు మంచి సంస్కారం నేర్పాలని,మొబైల్ ఫోన్లు అందించకూడదని,ఇంట్లో టీవీ చూడకూడదని తల్లిదండ్రులకు సూచించారు.పిల్లల భవిష్యత్తు మెరుగుపడేలా క్రమశిక్షణ, నైపుణ్యాలు నేర్పించాలి అని పేర్కొన్నారు.అంతేకాకుండా విద్యార్థుల విద్యాభివృద్ధి,మానసిక అభివృద్ధి కోసం పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్ పటేల్ ను అభినందించారు.ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీహరి తిరునగరి "శాండ్విచ్ పేరెంటింగ్" అనే కాన్సెప్ట్‌ను వివరించి తల్లిదండ్రులు పిల్లలతో ఎప్పుడు కఠినంగా ఉండాలి, ఎప్పుడు ప్రేమతో మెలగాలి అనే విషయాన్ని వివరించారు. 21వ శతాబ్దపు స్కిల్స్ నేర్పించడం ఎంత ముఖ్యమో తెలిపారు.భైంసా మండల విద్యాధికారి సుభాష్,భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు రూపకల్పనలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్, నరహరి నాయక్, విశ్వక్ సేన్,సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఉత్తర తెలంగాణ చైర్మన్ డాక్టర్ సావ పండరి,విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.






### బాసరలో అష్టవాదాన కార్యక్రమం

**బాసర,మార్చ్ 15,సూర్య మేజర్ న్యూస్:** విశాఖపట్నం వాస్తవ్యులు ప్రముఖ అవధానులు బొల్లాప్రగడ శశిశర్మగారిచే అష్టావధానం నిర్వహించగలమని-నిర్వాహకులు, పద్యకవులు, సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాదు నిజామాబాదు ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు బి. వెంకట్ కవి, కదారి దశరథ్ శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు నిర్మల అంబికానాథశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు బాసరలోని శారదా నగర్ లో గల కోటి కోటి పార్థివ లింగస్తూప సాహితీ ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము హాల్లో మధ్యాహ్నము 3 గంటల నుండి ఈ అష్టావధానం కార్యక్రమము ఉంటుందని చెప్పారు. సభకు సంచాలకులుగా పద్యకవులు- బొందిడి పురుషోత్తమరావు, ప్రాశ్నికులుగా డా.కోవెలశ్రీనివాసాచార్యులు( నిషిద్ధాక్షరి),కదారి దశరథ్ (సమస్యాపూరణం),బి. వెంకట్ (దత్తపది),శ్రీనివాస్‌గౌడ్ (వర్ణన),గంగుల చిన్నాన్న (న్యస్తాక్షరి),కొండూరు పోతన్న (ఛందోభాషణము),జాదవ్ పుండలీక్ రావు పటేల్ (ఆశువు), బసవరాజు (అప్రస్తుతప్రసంగం) లు పాల్గొననున్నారని చెప్పారు. కవులు, కళాకారులు, మేధావులు, సాహితీవేత్తలు,రచయితలు పాల్గొనవచ్చని చెప్పారు.

## రక్తదానం చేసిన నాయకులు మహిపాల్

**ఖానాపూర్ , సూర్య మేజర్ న్యూస్ :**

ఖానాపూర్ కు చెందిన నిరుపేద మహిళా ప్రాణాపాయ స్థితిలో నిర్మల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ అత్యవసరంగా వారికి ప్లేట్లెట్స్ అవసరం ఉండగా, పై విషయం తెలుసుకుని వెంటనే స్పందించిన బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు టీమ్ భూక్యా జాన్సన్ నాయక్ సభ్యులు డా.సుద్దాల మహిపాల్ , వారికి ఎస్డిపి బ్లడ్ ప్లేట్లెట్స్ ఇవ్వడం జరిగింది. మహిపాల్ మహిళా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్యే

**ఖానాపూర్ సూర్య మేజర్ న్యూస్ :**

ఖానాపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.అనంతరం ఇటీవల మృతి చెందిన బిక్కునూరి రమేష్, అముద కిషోర్ ల కుటుంబాలను పరామర్శించారు.మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా అముద కిషోర్ కుటుంబ సభ్యులకు 5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దయానంద్, రాజూర సత్యం, అంకం రాజేందర్ , తోట సత్యం , నిమ్మల రమేష్ తదితరులు ఉన్నారు.

## నేడు గోలేటి టౌన్షిప్ సి ఈ ఆర్ క్లబ్ లో ఆయుర్వేద వైద్య శిబిరము

**బెల్లంపల్లి, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్, హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యములో ఆదివారం గోలేటి టౌన్ షిప్ లోని సి.ఈ.ఆర్. క్లబ్ లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని, అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉద్యోగులు, గ్రామస్తులను పరీక్షించి దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్ళ, మోకాళ్ళ నొప్పులు, బి.పి. షుగర్, పక్షవాతము, అజీర్ణము, మలబద్ధకము, అస్తమా, స్త్రీల వ్యాధులు మొదలగు వాటికి మందులు అందజేస్తారు. కావున ఉద్యోగులు, గ్రామస్తులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సింగరేణి సూపర్ బజార్ ను వెంటనే ప్రారంభించాలి

**నస్పూర్, మార్చ్ 15, సూర్య మేజర్ న్యూస్:**

నస్పూర్ కాలనీలో గల సింగరేణి సూపర్ బజార్ మూసి వేయడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని, శనివారం నస్పూర్ కాలనీలో హెచ్ఎంఎస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒకటో తారీకు నుండి ఇప్పటివరకు 15 రోజులు గడుస్తున్న, యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు అని, గతంలో కూడా సూపర్ బజార్లో పూర్తిస్థాయి వస్తువులు లేక కార్మికులు ఇతర సూపర్ మార్కెట్లలో వస్తువులు విక్రయించేవారు అని అన్నారు. సింగరేణి యాజమాన్యం సూపర్ బజార్ పట్ల చిన్నచూపు చూస్తుంది, అని శ్రీరాంపూర్ ఏరియాలో సుమారు 9400 మంది కార్మికులు ఉన్నప్పటికీ, సూపర్ బజార్లను, రిలయన్స్, డి మార్ట్, లాంటి షాప్ ల లాగా ఆధునీకరించలేక పోతుంది అని అన్నారు. కార్మికుల సంక్షేమం విషయంలో ఏఐటి యుసి సంఘం పూర్తిగా విఫలమైంది అని, ఇప్పటికైనా వెంటనే సూపర్ బజార్ను పునః ప్రారంభించాలని యాజమాన్యానికి డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ నాయకులు తిప్పరపు సారయ్య , ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం లక్ష్మణ్, ఏరియా సహాయ కార్యదర్శి నోముల బాలయ్య పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

**కడెం,మార్చి15, సూర్య మేజర్ న్యూస్ :**

నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఆదేశాల మేరకు కడెం మండలంలోని కొండుకూర్ గ్రామ శివారులోని ఓ ఫామ్ హౌస్ లో గల పేకాట స్థావరంపై ఏఎస్పి రాజేష్ మీన, ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 18 సెల్ ఫోన్స్, ఆరు బైకులు, 4 మందు బాటిల్స్,101000 రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకొని 18 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని పోలీసులు కేసులు నమోదు చేశారు. హోలీ పండుగ రోజు రాత్రి ఎవరు రారని నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు చెందిన పలువురు వ్యాపారులు, రిటైర్డ్ అధికారులు, దర్జాగా పేకాట ఆడుతున్నారని పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు పోలీసులు ఈ రైడ్ చేసినట్లు తెలుస్తోంది.ఎంతటి వారైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట స్థావరంపై దాడిలో సిఐ అజయ్,ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి పాల్గొన్నారు.



## బెల్లంపల్లిలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

**బెల్లంపల్లి, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్:**

రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు శనివారం బెల్లంపల్లి అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గెల్లిజయరాం యాదవ్ మాట్లాడారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి లు దళిత ద్రోహులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిలువేరు సత్యనారాయణ,డీ కె రాయలింగు,ఎంఏ నయీం, కటకం సతీష్, ఎనగందుల వెంకటేష్, దేవసాని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులు ఇవ్వాలని బెదిరించిన ముగ్గురు ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్ల పై కేసు

**బెల్లంపల్లి, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్:**

ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల మని చెప్పి డబ్బులు ఇవ్వాలని వైద్యున్ని బెదిరించిన ముగ్గురు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎన్ దేవయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో బెల్లంపల్లి పట్టణంలోని మెయిన్ బజార్ లోని కృష్ణ మందిర్ రోడ్డులో గల నిత్యా పిల్లల ఆసుపత్రి వద్దకు వెళ్ళిన ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు నవాబ్, షంశాద్అహ్మద్, మరోవ్యక్తి కలిసి వైద్యుని వద్దకు వెళ్లి రూ., 10 వేలు ఇవ్వాలని బెదిరించినట్లు సీఐ తెలిపారు. విషయాన్ని వైద్యుడు ఆసుపత్రి యాజమాని కొమురవెల్లి సంతోష్ కు తెలిపాడని పేర్కొన్నారు. సంతోష్ డబ్బులు ఎందుకు ఇవ్వాలి ఇవ్వం అని చెప్పడంతో వారు అతన్ని బెదిరించారని సీఐ తెలిపారు. ఆసుపత్రి యాజమాని సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## సీఎం దిష్టి బొమ్మ దహనం చేసిన ఘటనలో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్యతో సహా 15మంది పై కేసు

బెల్లంపల్లి, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్:

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన ఘటనలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో సహా 15 మందిపై టూ టౌన్ పోలీసులు కేసు చేశారు. బెల్లంపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ అఫ్జలుద్దీన్ కథనం ప్రకారం శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడంతో మున్సిపల్ కార్యాలయం చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారని సీఐ తెలిపారు. కేసు నమోదు అయిన వారిలో మద్దెల గోపి, సబ్బని అరుణ్ కుమార్, కాంపల్లి రాజం ,గద్దల ధర్మేందర్, దాగం చరణ్ ,సందీప్, పైడిమల్ల చంద్రశేఖర్, కలీం, శ్రావణ్ ,సతీష్, మద్దెలగోపి, తాళ్లపల్లి మల్లయ్య, ఎండి అలీ, రంగ రమేష్, గోగర్ల సత్యనారాయణ లు ఉన్నట్లు సీఐ వివరించారు.

## జాతీయ ఖేలో ఇండియా పోటీలకు బెల్లంపల్లి యువతి ఎంపిక

**బెల్లంపల్లి, మార్చి 15, సూర్య మేజర్ న్యూస్:**

ఈనెల 20 నుంచి 24 వరకు ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని బిలాస్ పూర్ లో జరిగే సీనియర్ మహిళల జాతీయ ఖేలో ఇండియా వుషు పోటీలకు బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన వేముల విష్ణు వేద ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని భాగల్ కోట్ లో జరిగిన దక్షిణ భారత ఖేలో ఇండియా వుషు పోటీల్లో పాల్గొన్న విష్ణు వేద అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ ఖేలో ఇండియా వుషు పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లా వుషు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేముల సతీష్,ఆవుల రాజనర్సు, కోశాధికారి జాడి సుప్రియ లు విష్ణు వేదను అభినందించారు.

## సహృదయానికి శాలువాతో సన్మానం.

**బోథ్, మార్చ్ 15,సూర్య మేజర్ న్యూస్**

బోథ్ మండల కేంద్రంలోని నాయి బ్రాహ్మణ కులస్థులు మాజీ సర్పంచ్ రాజు యాదవ్ ను శాలువ కప్పి సన్మానించారు. వివరాల్లోకివెళ్తే,సోయం బాపూరావు ఎంపీగా ఉన్నప్పుడు నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు మాజీ సర్పంచ్ రాజు యాదవ్ ద్వారా తమ సంఘ భవనానికి నిధులు ఇవ్వమని కోరగా తన ఎంపీ నిధుల నుండి మూడు లక్షల రూపాయలు ఇవ్వడం జరిగింది. మంజూరు అయిన నిధులను నగదుగా మాజీ సర్పంచ్ గొర్ల రాజు యాదవ్ బ్యాంకు నుండి డ్రా చేసి ఇవ్వడమైనది. అందుకుగాను నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ గొర్ల రాజు యాదవ్ ని శాలువాతో సత్కరించి ఎల్లవేళలా మీ వెంబడే ఉంటామని ఇటువంటి కార్యక్రమాలు మును ముందు మీరు ఇంకా చేయాలని వారు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మంజూరు చేసిన ఎంపీ బాపూరావుకి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్ల రాజు యాదవ్ తో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అబ్రార్ నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు అందరూ స్వీట్లు తినిపించి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

## 28 సార్లు రక్తం దానం చేసిన పురుషోత్తం

**భైంసా టౌన్,మార్చ్ 15,సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణంలోని సాయి సుప్రియ హాస్పిటల్ లో భూమరెడ్డి అనే పేషంట్ కు రక్తము తక్కువ అయిన విషయాన్ని డాక్టర్ రజినీకాంత్ భైంసా బ్లడ్ డోనార్స్ గ్రూప్ కు సమాచారం అందించారు.ఫోన్ ద్వారా విషయం తెల్సుకున్న ఫోన్ చెసిన వెంటనే పురుషోత్తం తన సొంత షాప్ వదిలి,సమాజం కోసం ముందుకూ వచ్చి స్పందించి జీవన్ దాన్ రక్తనిధి కేంద్రానికి వచ్చి తన అమూల్యమైన ఓ పాజిటివ్ రక్తము ఇవ్వడం జరిగింది. రక్తం ఇచ్చిన దాత పురుషోత్తంకు రోగి బంధువులు,ఆసుపత్రి సిబ్బంది అభినందించారు. ఇప్పటివరకు 28 సార్లు రక్తం ఇవ్వడం జర్గిది.ఈ కార్యక్రమం లో రవీందర్,విజయ్,బ్లడ్ బ్యాంక్ సిబ్బంది గోపి పాల్గొన్నారు.

## అరుదైన ముద్రణ - అంతర్జాతీయ పత్రికలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడి పరిశోధనా పత్రం ప్రచురణ"

**కాగజ్నగర్, సూర్య మేజర్ న్యూస్**

కాగజ్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వీరమల్ల దేవేందర్ రెడ్డి రాసిన పరిశోధనా పత్రం అంతర్జాతీయ పత్రికలో ప్రచురించబడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. "అరటి తొక్కలను ఉపయోగించి మృత్తిక నాణ్యతను మెరుగు పరచడం ,కూరగాయల దిగుబడి ని పెంచడం" అనే అంశంపై డా.దేవేందర్ రాసిన పరిశోధనా పత్రాన్ని ప్రముఖ అంతర్జాతీయ పత్రిక "ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ అప్లైడ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ" లో ప్రచురించింది. సందర్భంగా డాక్టర్ దేవేందర్ రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం, మిగతా అధ్యాపకులు మరియు అధ్యాపకేతర బృందం అభినందించారు.

## ఈ నెల 17న ఆయుర్వేద వైద్య శిబిరం

**మందమర్రి, మార్చ్ 15, సూర్య మేజర్ న్యూస్.**

సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంత వాసుల ఆరోగ్య సౌకర్యార్థం ఈ నెల 17 వ తారీఖున ఏరియాలోని సిఈఆర్ క్లబ్ లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కీళ్ల, మోకాళ్ల నొప్పులు, బిపి, షుగర్, పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, అస్తమా, స్త్రీ సంబంధిత, దీర్ఘకాలిక వ్యాధులకు సోమవారం ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు సిఈఆర్ క్లబ్ లో (మాతా రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, హైదరాబాద్) ఆయుర్వేద వైద్యులు విశ్వనాథ మహర్షి సౌజన్యంతో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని, ఈ వైద్య శిబిరానికి ఇంతకు మునుపు హాజరైన వారు, కొత్తగా వైద్యం కోసం వచ్చే వారు అందరూ హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి యజమాన్యం కోరింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయం..

## మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా చెక్కుల పంపిణీ.

**హాజీపూర్ , మార్చి 15,సూర్య మేజర్ న్యూస్,**

మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని వేంపల్లి గ్రామంలోని



పద్మావతి గార్డెన్లో వంంచిర్యాల నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు 132 మంది లబ్ధిదారులకు 41,15, 000/- రూపాయల చెక్కులను లబ్ధిదారులకు మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలు అందజేశారు.ఈ కార్యక్రమంలో దండేపల్లి లక్షెట్టిపేట , హాజీపూర్ తహసిల్దార్లు , ఆర్డీవో శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీకి చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,మహిళా నాయకురాల్లు,కార్యకర్తలు,లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై , కుటుంబం గురించి ఆలోచిస్తూ వ్యక్తి ఆత్మహత్య

**కడెం,మార్చి 15 సూర్య మేజర్ న్యూస్ :**

కడం మండలం, మొర్రిగూడెం గ్రామంనికి చెందిన ఆకుల సత్తన్న అనునతడికి పెండ్లి అయి 20 ఏండ్ల నుండి సంతానం లేదు, దాంతో భాదతో తన భార్య గత 2 సంవత్సరాల క్రితం అనారోగ్యం తోక చనిపోయింది. అప్పటి నుండి ఆకుల సత్తన్న మద్యానికి బానిసై, నాకు భార్య లేదు, పిల్లలు లేరు అని భాదపడుతూ ఉండేవాడు. రెండు మూడు సార్లు చనిపోతా అని ఆత్మహత్య ప్రయత్నం చేసుకోబోయేవాడు. శుక్రవారం రోజున ఉదయం నుండి మద్యం సేవించి, తేదీ శనివారం రోజున ఉదయం లేచి చూసేసరికి ఆకుల రాజు యొక్క ఇంటి బాత్ రూమ్లో లోపల గడియ పెట్టుకొని బాత్ రూమ్లోని ఇనుప పైపుకి ఆకుల సత్తన్న తన తువ్వాలతో ఉరి వేసుకుని చనిపోయాడని మృతుడి తమ్ముడు ఆకుల శంకర్ ఫిర్యాదు మేరకు కడం ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.